# అప్పుడు 2850.. ఇప్పుడు 10వేలు

**తెలంగాణ వచ్చిన తర్వాత పెరిగిన మెడికల్ సీట్లు**

**కొత్త కళాశాలల రాకతో నగరంపై తగ్గిన భారం**

**సీఎంఆర్ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు**



సీఎంఆర్ మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

మేడ్చల్, అక్టోబర్ 4 : బీఆర్ఎస్ హయాంలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖామంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో చామకూర గోపాల్ ఏర్పాటు చేసిన సీఎంఆర్ మెడికల్ కళాశాలలను మంత్రి హరీశ్‌రావు, మంత్రులు మల్లారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో కేవలం 2,850 మెడికల్ సీట్లు మాత్రమే ఉండేవన్నారు. వైద్య విద్యను అందుబాటులో లేని కారణంగా రాష్ట్రానికి చెందిన విద్యార్థులు రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పిన్స్ తదితర దేశాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేదన్నారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ పూనుకున్నారన్నారు. గతంలో 2850 మెడికల్ సీట్లు ఉంటే ప్రస్తుతం 10వేలు మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీంతో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఎవరి జిల్లాలో వారే చదువుకునే అవకాశం కల్పించారన్నారు. ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో కూడా 50 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒక్కో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 500 పడకల ఆస్పత్రి ఉంటుందన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఆస్పత్రుల ద్వారా నగరంపై భారం కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో కూడా ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందజేస్తుందని ఆయన చెప్పారు.

**విద్య, వైద్య రంగాల్లో అనూహ్య ప్రగతి**

సీఎం కేసీఆర్ హయాంలో విద్య, వైద్య రంగాల్లో అనూహ్య ప్రగతి రాష్ట్రం అనూహ్య ప్రగతి సాధించిందని కార్మిక శాఖా మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రైవేట్‌లోనూ ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం కన్వీనర్ కోటాను విద్యార్థులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. సీఎంఆర్, మల్లారెడ్డి మెడికల్ కళాశాలల ద్వారా ఉచితంగా వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. సీఎం కేసీఆర్,మంత్రి కేటీఆర్ హైదరాబాద్ ఐటీ హబ్‌గా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, జడ్పీటీసీ శైలజావిజయానందారెడ్డి, డాక్టర్ చామకూర భద్రారెడ్డి, సీఎంఆర్ కార్యదర్శి చామకూర గోపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, జగన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, ఫిలిప్స్, సుధాకర్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌కు మరింత జోష్

**నందికంటి చేరికతో గులాబీ పార్టీకి మరింత ఊపు**

**సమీపంలోనూ కనిపించని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఉనికి**



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నేత నందికంటి శ్రీధర్ తదితరులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ)/మల్కాజిగిరి : గత పదేళ్లలో ఊహించని రీతిలో జరిగిన అభివృద్ధి.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే గులాబీ పార్టీ బలగం.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుంచి తోడైన అదనపు బలం.. వెరసి మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా మారింది. వాస్తవానికి తెలంగాణ ఏర్పాటు నుంచి నియోజకవర్గ ప్రజలు గులాబీ జెండానే ఆదరిస్తూ వస్తున్నారు. అభ్యర్థి ఎవరైనా సరే.. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ఆశీర్వదిస్తున్నారు. దీంతో తాజా ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయబావుటా ఎగురవేసి హ్యాట్రిక్ సాధించడం ఖాయంగా కనిపిస్తున్నది. మేడ్చల్–మల్కాజిగిరి నియోజకవర్గం ఆది నుంచి బీఆర్ఎస్‌కు అండగా ఉన్నది. 2014లో నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా చింతల కనకారెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 2018లో మైనంపల్లి హన్మంతరావు గెలుపొందారు. అయితే అభ్యర్థి ఎవరనేది కాకుండా ఇక్కడ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారనేది ప్రతి ఎన్నికల్లోనూ రుజువు అవుతుంది. ఈ నేపథ్యంలో గత పదేండ్లలో హైదరాబాద్ నగరాభివృద్ధిలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోనూ భారీ ఎత్తున అభివృద్ధి జరిగింది. అర్హులైన నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలూ అందాయి. ఈ క్రమంలో తాజాగా కాంగ్రెస్ పార్టీ నుంచి భారీ ఎత్తున చేరికలు జరిగాయి. స్థానికుడు, మూడున్నర దశాబ్దాలుగా మల్కాజిగిరి నియోజకవర్గ రాజకీయాల్లోనే అనుభవం ఉన్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, ప్రగతి భవన్‌లో బుధవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు ఆ పార్టీకి చెందిన అనేక మంది ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కూడా గులాబీ కండువా కప్పుకున్నారు. ముఖ్యంగా నిద్రాహారాలు మాని బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని నందికంటి శ్రీధర్ బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ధీమా వ్యక్తం చేయడం విశేషం.

**బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు వీరే..**

టీపీసీసీ సెక్రెటరీ, ఎక్స్‌ఫ్లోర్ లీడర్ దొలి రమేశ్, 140 డివిజన్ ప్రెసిడెంట్ వి.శ్రీనివాస్‌గౌడ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ సీఎల్ యాదగిరి, డీసీసీ జాయింట్ సెక్రెటరీ సూర్య ప్రకాశ్, 133 డివిజన్ ప్రెసిడెంట్ ఎ.పవన్, 134 డివిజన్ ప్రెసిడెంట్ సూర్యప్రకాశ్‌రెడ్డి, 135 డివిజన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసులు, 137 డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్, 138 డివిజన్ ప్రెసిడెంట్ జీ.వంశీ ముదిరాజ్, మీడియా సెల్ కన్వీనర్ జీ.రాంచందర్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అలీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు, 137 డివిజన్ కార్యదర్శి సాయిరాం, 133 డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఫహీం, 139 డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అక్తర్, 134 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరికుమార్, 140 డివిజన్ మహిళా అధ్యక్షురాలు నవనీత, 140 డివిజన్ సెల్ ప్రెసిడెంట్ రాములు బీఆర్ఎస్‌లో చేరారు.

# సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

ఉప్పల్, అక్టోబర్ 4 : ఉప్పల్‌లోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీనటి కృతిశెట్టి షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొని సందడి చేశారు. దీంతో అభిమానులు, కొనుగోలుదారులు భారీగా తరలివచ్చారు. సినీనటి కృతిశెట్టి పలు వస్త్రాభరణాలను పరిశీలించి, వాటిని ప్రదర్శించారు. ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వాహకుడు ఎంవీ.రమణ ఆఫర్లు ప్రకటించడంతో కొనుగోలుదారులతో షాపింగ్‌మాల్ సందడిగా మారింది.



బుధవారం ఉప్పల్‌లోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి, బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



## మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు

రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మంత్రి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్‌లో వంద పడకల దవాఖానను మంజూరు చేయడం పట్ల ఉప్పల్ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

*- కాప్రా, అక్టోబర్ 4*



## సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఉప్పల్ నియోజకవర్గానికి వంద పడకల దవాఖానను మంజూరు చేయడం పట్ల సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చక్రీపురం చౌరస్తాలో చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, జాండ్ల సత్తిరెడ్డి, కొల నరేశ్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

*- చర్లపల్లి, అక్టోబర్ 4*



టీజీవో భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కలిసి వినతిపత్రాన్ని అందజేసిన టీజీపాలా నేతలు

## మెరుగైన పీఆర్సీకి కృషి చేయండి

**టీజీవోకు టీజీపాలా నేతల వినతి**

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇప్పించేందుకు కృషి చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలను తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీపాలా) కోరింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు బుధవారం నాంపల్లిలోని టీజీవో భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వి.మమత, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమ ఏఐసీటీఈ బకాయిల విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని, సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవో నగరశాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, మహ్మద్ ఖాదర్, జీఎస్ చంద్రజ్యోతి, టీజీపాలా అధ్యక్షుడు వై.నర్సయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ చక్రవర్తి, డి.వెంకటేశ్వర్లు, బి.శ్రావణ్‌గౌడ్, పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.